# నందనవనం - 21

ఇద్దరు మనుష్యుల సాయంతో మెల్లగా నడిచి వస్తున్న ఆయనను చూసి శ్రీవల్లి విస్తుపోయింది. ‘పొలం పనులు చూడటానికని వెళ్ళిన ఈయనకు ఇంతలోనే ఏమైంది...?’ కంగారు పడుతూ దగ్గరకు వచ్చి మెల్లగా లోపలకు తీసుకువెళ్ళింది. వెంట వచ్చిన వాళ్ళని ఏదో అడగబోతోంటే, ‘‘మాకూ ఏమీ తెలియదమ్మా...’’ అంటూ వాళ్ళు వెంటనే వెనుదిరిగి వెళ్ళిపోయారు.

మంచంమీద పడుకున్న ఆయన మెల్లగా ‘‘ఏం లేదులే... నువ్వనవసరంగా కంగారు పడకు... ఒళ్ళంతా నొప్పులుగా ఉంది. రెండు రోజులకు సర్దుకుంటుందిలే...’’ అని శ్రీవల్లికి చెప్పాడు. ‘‘ఏమైందసలు...?’’ మళ్ళీ ఆరాతీసింది.

మౌనమే సమాధానం అయ్యేసరికి... మెల్లగా చొక్కా పైకెత్తి చూసిన ఆవిడ నిర్ఘాంతపోతూ...‘‘సుబ్బూ... ఈ దెబ్బలేమిటీ ఎలా...?’’ అనడిగిన ఆవిడ కళ్ళ నుండి నీళ్ళు జలజలా రాలాయి!

ఏకాంతంలో అపుడపుడూ ఆ పిలుపు ఆవిడ నోటివెంట అనుకోకుండా వచ్చేయటం అలవాటే!

ఆయన ఆవిడ చేతిని ఆప్యాయంగా పట్టుకుని అనునయంగా అన్నాడు. ‘‘నువ్విలా ప్రేమగా పిలుస్తూ ఆదరంగా చూస్తూంటే... నొప్పులన్నీ తగ్గిపోయి, ఒళ్ళంతా తేలికైపోయినట్లు ఎంత హాయిగా ఉందో తెలుసా...?’’

‘‘సరేలే’’ అన్నట్లు ఓ సెకను సేపు మురిపెంగా చూసింది. మళ్ళీ వెంటనే బొంగురుపోయిన కంఠంతో ఆరా తీసింది.

‘‘అక్కడో, ఎక్కడో పడ్డాననే కట్టు కథలు చెప్పకండి. ఏం జరిగిందో నాకు తెలియాలి, వివరంగా చెప్పాల్సిందే...!’’

గట్టిగా నిలదీసి అడుగుతున్నట్లనిపించిన ఆ మాటలకు ఆయన నిట్టూర్చి మెల్లగా చెప్పుకొచ్చాడు.

‘‘నేను అటు... పొలంవైపు వెళ్తున్నానా... మిమ్మల్ని కలవాలనీ, ఎవరో పిలుస్తున్నారంటూ ఎక్కడికో తీసుకెళ్ళారు నలుగురు. అక్కడ కొందరు నాలుగు వైపులా నిలబడి ఓ చీకటి గదిలో నన్ను నిలబెట్టి నానా హింసాపెట్టారు...’’

మధ్యలోనే శ్రీవల్లి ‘‘ఎందుకూ...?’’ అంటూ దీర్ఘం తీసింది.

‘‘అదే నాకూ అర్థం కాలేదు. ‘ఈ ఊరు ఎందుకు వచ్చావూ, ఎన్నాళ్ళుంటావో చెప్పాల్సిందే...’ అంటూ దాడికి తెగబడ్డారు...’’

‘‘ఏం చెప్పారేం...?’’

‘‘నేనేం చెబుతాను... ఈ ఊళ్ళో తాతగారి ఇంట్లో కొన్నాళ్ళు ఉందామనే కోరికతోనే... వచ్చామని చెప్పినా... నమ్మినట్లులేదు. అసలు కారణం చెప్పమంటూ పదే పదే...’’ ఇక మాట్లాడలేనట్లుగా ఆయన మౌనంగా ఉండిపోయారు.

శ్రీవల్లికి దుఃఖం ముంచుకొచ్చింది.

‘‘మీ లాంటి మనిషిని కొట్టటానికి వాళ్ళకి చేతులెలా వచ్చాయి...? ఏం అపకారం చేశారు...’’ అంటూ ఓ క్షణం వెక్కిళ్ళు పెట్టిన ఆవిడకు మరుక్షణం రోషం వచ్చింది.

‘‘మీ అంతట మీరుగా ఎవరికీ అపకారం తలపెట్టరు... కొట్టటానికయినా చేయి ఎత్తరు... కోపం ఎంత వచ్చినా నిగ్రహించుకుని మెత్తగానే మాట్లాడతారు... అంతవరకూ

సరే, బాగానే ఉందిగానీ, ఎదుటి వాళ్ళు విచక్షణ లేకుండా మీద పడితే, ఎదురు తిరగటం తప్పేం కాదుగా...? మీరేమైనా ఏసు క్రీస్తునో, గౌతమ బుద్ధుడినో అనుకుంటున్నారా...?''

''నేనేం అంత తెలివితక్కువ వాడిని కాదులే... అంతటివాళ్ళతో పోల్చుకునేందుకు...! కాకపోతే, ఎందుకనో గానీ... నిజంగానే ఆ క్షణాలలో వాళ్ళిద్దరూ మాత్రం గుర్తుకు వచ్చారు! తనని శిక్షిస్తున్న వాళ్ళని చూసి 'వాళ్ళు చేస్తున్నదేమిటో వాళ్ళకే తెలియదు... క్షమించమని' దేముడిని ప్రార్థించిన క్రీస్తునూ, శాంతమూర్తి గౌతమబుద్ధుడినీ తలుచుకుని మనసులో నమస్కరించాను! ఎంతో ప్రశాంతంగా అనిపించి... వాళ్ళ దెబ్బలను తట్టుకోగలిగిన నిబ్బరం వచ్చింది...!''

ఆవిడ తీక్షణంగా చూసింది.

''అది ధీరత్వం అనిపించుకోదు! కేవలం చేతగాని తనంగా మాత్రమే కనిపిస్తుంది! అందుకే వాళ్ళలా రెచ్చిపోగలిగారు...! వాళ్ళని కొంచెంగానైనా ఎదుర్కోవాలని అనిపించలేదా...?''

''ఆ రోజు... మనింటికి వచ్చి దాడి చేయబోయిన వాళ్ళలో ఒకడు మాత్రం... నన్ను చూసి ఎంత భయపడ్డాడో మొహంలో స్పష్టంగా తెలిసిపోతూనే ఉంది! అందరూ ముందుకు ఉరుకుతుంటే... వాడు మాత్రం నక్కి నక్కి వెనక్కి పోవటం కనిపించి నవ్వొచ్చింది కూడా!''

''మరి... అపుడైనా మిగతా వాళ్ళకీ, మీరేమిటో కొంచెం తెలియచెప్పాల్సింది! అప్పుడు వాడు మీ చేతికి చిక్కి మీ పిడికిలి పట్టు బిగువును రుచి చూడడంతో కొంచెం తెలివి తెచ్చుకోగలిగాడన్నమాట!'' శ్రీవల్లి మాటలకు ఆయన మరోసారి గట్టిగా నిట్టూర్చాడు.

దుఃఖంతో ఏదో సణుక్కుంటూనే శ్రీవల్లి మరో గదిలో నుండి కొబ్బరినూనె తీసుకువచ్చి మెల్లగా ఆ దెబ్బలపై రాసింది. ఆ తరువాత ఇంకేదో ఆయింట్‌మెంటూ తెచ్చిరాసింది.

''ఒక చెంపపై కొడితే, మరో చెంపా చూపించమనే గాంధీగారి సిద్ధాంతం గుర్తుకువచ్చి... వాళ్ళతో ఒళ్ళంతా చితక్కొట్టించుకున్నారు కదూ...?'' కొంచెం వ్యంగ్యంగా అడిగిన శ్రీవల్లివైపు ఆయన నిర్లిప్తంగా చూశాడు.

''నా మనసులో అపుడు నేనేం అనుకున్నానో, అన్నీ నీకు బాగానే తెలిసిపోతున్నాయే...! చిత్రంగా ఉంది కదూ...!''

వేళాకోళంగా ఆయన అన్న ఆ మాటలకు శ్రీవల్లి నవ్వలేదు సరికదా కోపంగా చూసింది.

''మీతో కలిసి నడవటం మొదలు పెట్టింది నిన్నా మొన్నా కాదుగా ఏ సమయంలో మీరేం అనుకుని ఎటువైపు అడుగులు వేస్తారో బాగానే తెలుసుకోగలను'' అంది శ్రీవల్లి మాటల్ని సాగదీస్తూ.

ఆయన మెల్లగా ఒక పక్కకు ఒత్తిగిల్లి ఒక చేయి తల క్రింద పెట్టుకుని చిరునవ్వుతో చూస్తూ అన్నాడు. 'తనని నరకటానికి వచ్చిన గొడ్డలికీ కలపనిచ్చేది చెట్టు మాత్రమే...' ఓపెద్దల సూక్తిని గుర్తు చేస్తూ మానాన్న తరచూ చెప్పే ఆ మాట నా మనసులో ఎప్పుడూ మెదులుతూనే ఉంటుంది.''

''గొప్పే...! అదేమిటో... గొప్ప గొప్ప వాళ్ళంతా మీ మనసులోనే తిష్ఠ వేసుక్కూర్చుని ఇలాంటి సూక్తులను గుర్తు చేస్తూ ఉంటారు కాబోలు! అవునా...'' ఆవిడ వెక్కిరింతగా చూసింది.

ఆయన ఆవిడ వ్యంగ్యాన్ని పట్టించుకోనట్లుగా అదే చిరునవ్వుతో సమాధానం చెప్పాడు. ''ధైర్యం శౌర్యం ఉండీ, దయ చూపగలగటమే గొప్ప లక్షణం! మహామహుల మాటల్ని మనసులో పదిలపరుచుకోవటంతోనే సరిపోదు... కొంతలో కొంతయినా ఆచరణలోనూ పెట్టటానికీ ప్రయత్నం చేయాలి! అవునా...?''

ఆ ప్రశ్నకు ఆవిడేదో సమాధానం చెప్పబోయింది గానీ... బయటనుండి ఇంటిలోపలకు కొడుకు వచ్చిన సడిని గమనించి... ఆ గది తలుపులు మెల్లగా చేరవేసి కొడుకు దగ్గరకు వచ్చింది.

రామం బట్టలపై నున్న మట్టి మరకలను చూసి నిర్ఘాంతపోయింది! ఎలాగో గొంతు పెగల్చుకుని ''ఏమిటీ అవతారం...?'' మెల్లగా అడిగింది.

రామం చిరునవ్వు చిందించాడు.

ఉతుకుడు కార్యక్రమంలో... మురికి నా బట్టలకూ కొంచెం అంటిందిలే!'' శ్రీవల్లి మెల్లగా నుదురు కొట్టుకుని ''ఏమిటీవేళ... ఇద్దరికీ...'' అంటూ ఏదో అనబోయి... మళ్ళీ స్పృహలోకొచ్చినట్లుగా సరిదిద్దుకుని... ''ఈ రోజెందుకనో మంచిదిగా అనిపించటం లేదు! లేకపోతే... ఎపుడూ ఎవరితోనూ గొడవల్లోకి దిగనివాడివి.... ఈ రోజెందుకని... ఇలాచేశావ్...?'' అనడిగింది.

రామం తల్లివైపు నిర్లిప్తంగా చూసి ''నాన్నలా నేను నీటు కాదు, నాటు...! అయినా నాకూ గొడవల్లోకి దిగటం ఇష్టం ఉండదు.... కానీ, కొందరు నాతో గొడవపెట్టుకోవాలని అనుకుంటే... మాత్రం నేను వాళ్ళని నిరుత్సాహపరచను...!'' అన్నాడు.

''అంటే...?'' ఆవిడ అర్థం కానట్లు అమాయకంగా చూసింది.

''అర్థంకాలేదా...? నిష్కారణంగా దాడి చేసినవాళ్ళని నేనూ వదిలిపెట్టను...!''

''నిన్నూ.... వాళ్ళు కొట్టారా...?'' ఉలిక్కిపడి ఆశ్చర్యంగా అడిగిందావిడ. రామం చిన్నగా నవ్వాడు.

''నన్ను కాదులే... నాన్నను! నేను వెళ్ళి వాళ్ళతో గొడవపెట్టుకుని కొడతానేమోననే కదూ, నాన్నకు దెబ్బలు బాగా తగిలాయానే విషయం నాదగ్గర దాచాలనుకున్నావ్... అమ్మా...!''

శ్రీవల్లి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవైనాయి!

రామం నిదానంగా చెప్పాడు ''అవునమ్మా... నాకీ విషయం తెలిసింది ఊళ్ళోకి రాగానే. నీలా అందరూ నాకు తెలియకూడదని అనుకోరుగా... ఉత్సాహంగా చేరవేసారీ వార్తని! తగిన రీతిలో సమాధానం చెప్పకపోతే.... నేను మామూలుగా ఉండలేను! రగులుతున్న నిప్పు కణికలా సెగలు చిమ్ముతూ ఉండటం కంటే... నా కోపం చూపించేసి ప్రశాంతంగా ఉండటమే మంచిది కదా...!''

శ్రీవల్లి ఏం మాట్లాడలేదు గానీ, ఆవిడ చూపుల్లో రేఖామాత్రంగా ప్రశంస కనిపించినట్లయి... రామం స్థిమితపడ్డాడు.

ఆవిడ రామం చేతిని పట్టుకుని తండ్రి పడుకుని ఉన్న గది దగ్గరకు తీసుకెళ్ళింది.

ఆయన లేచి కూర్చునే ప్రయత్నం చేయబోయాడు గానీ కుదరక మళ్ళీ పడుకుని ''ఏమిటిద్దరూ ఏదో వాదులాడుకుంటున్నట్లున్నారు..?'' అనడిగాడు మెల్లగా.

''ఏం లేదులే నాన్నా...'' అంటూ రామం తండ్రి పక్కనే మంచం మీద ఓ వారగా కూర్చుని 'కాటు వేయకపోయినా గానీ, బుస కొడుతూ నైనా భయపెట్టకపోతే, చివరకు

చిన్నపిల్లలైనా రాళ్ళతో పామును కొట్టి తమ ప్రతాపం చూపిస్తారనే' కథను అమ్మకు గుర్తుచేస్తున్నాను...!'' అన్నాడు.

ఆయన రామాన్ని చిరునవ్వుతో చూసాడు... ''నా ప్రశ్న ఏమిటంటే... కత్తితో పొడిచి గాయం చేసిన వాడిది తప్పుగానీ కత్తిది కాదుగా అని! అవును కదూ...? పాపం వాళ్ళంతా కిరాయి మనుష్యులు. పేదరికంతో ఏ పని చేయటానికయినా సిద్ధపడతారు! అలాంటి వాళ్ళని శిక్షించాలనుకోవటం ఎందుకు చెప్పూ...!''

అప్పుడు రామం తల్లివైపు చూస్తూ సందేహం బయటపెట్టాడు. ''అసలు ఎందుకు, ఎవరికి మన మీద కోపం వచ్చి ఉంటుందో... నాకేం అర్థం కావటం లేదు, వాళ్ళు నా చేతిలో దెబ్బలు తిన్నారుగానీ ఎవరిపేరూ చెప్పలేదు! వాళ్ళు చాలా నిజాయితీ పరులన్న మాటేగా! డబ్బు తీసుకున్నందుకు... పనిచేశారుగానీ ఎగ్గొట్టలేదు! నమ్మకం కూడా చూపించారు... అందుకే తమకా పని పురమాయించిన వారి పేరూ బయటపెట్టలేదు చూశావా." అతని పెదవులపైకి తమాషా అయిన చిరునవ్వు వచ్చింది.

శ్రీవల్లీ ఆలోచనగా చూస్తూ ''అదే అర్థం కావటంలేదు! ఈ ఊరు వచ్చి మనం నలుగురికీ మనకి చేతనైన విధంగా సాయం చేయాలనే ప్రయత్నం చేసామే తప్ప ఎవరికీ హాని తలపెట్టలేదుగా..? మరి...?'' అంటూ ఎందుకిలా జరిగి ఉంటుందనే ప్రశ్నను మాత్రం పైకి అనకుండా కళ్ళల్లో చూపించింది.

ఆయన కూడా ఆలోచనలో పడ్డట్టు మొహం పెట్టాడు. ''మనం ఈ ఊరుకు రావటం వలన ఎవరికైనా ఏదో నష్టం జరుగుతుందేమో... అందుకే, మనం ఇక్కడనుండి మకాం ఎత్తేయటానికి భయపెట్టాలను కుంటున్నారనిపిస్తోంది...! ఇలా జరగటం రెండోసారి కూడానూ!''

''ఈ ఊళ్ళోని మామూలు జనాలకి అటువంటి భయమేదీ ఉండదు. కొందరు పెద్దలకు అలాంటి ఆలోచన ఉంటే, ఉండొచ్చు...!'' అంది శ్రీవల్లి.

''అయితే భద్రయ్యా...?'' ఆయన ప్రశ్నార్థకంగాచూసాడు.

శ్రీవల్లి తల అడ్డంగా వూపుతూ ''అలా అయివుండదు! మొదట్లో... ఆయన ప్రవర్తన పట్ల నాక్కొంచెం అనుమానం ఉండేది! అతి ప్రేమ చూపిస్తున్నారు... ఏదో కారణం ఉంటుందనుకున్నా. అందుకు తగ్గట్లుగా ఆయన మన ఇల్లంతా పరిశోధిస్తున్నట్లుగా చూస్తున్నట్లనిపించి... అలాంటి అభిప్రాయానికి వచ్చానుగానీ... ఇపుడు మాత్రం ఆయన గురించి నేనే పొరబడ్డాననిపించింది! అసలటువంటి అవసరం మాత్రం ఆయనకేం ఉందీ? ఆపైన మనతో వియ్యమందాలని ఉవ్విళ్ళూరుతున్న ఆయన మనకి చేటు చేయాలని ఎందుకు అనుకుంటారూ...?'' స్వగతంలా పైకే మెల్లగా అంది.

వింటూన్న వాళ్ళిద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు!

''అంటే...?'' ఇద్దరూ అప్రయత్నంగా ఒక్కసారే అంటూ ఆమెవైపు ఆశ్చర్యంగా చూసారు.

అప్పటికి శ్రీవల్లికి అర్థమైంది! భద్రయ్య ఇంట్లో జరిగిన విషయాలేవీ వాళ్ళకు చెప్పనే లేదని!

ఇక అపుడు జరిగిందంతా క్లుప్తంగా వివరించింది.

ఆయన శ్రీవల్లి వైపు విస్మయంగా చూశాడు. ''పరమేశ్వరం గారి అమ్మాయిని ఎంతగానో ఇష్టపడిని నువ్వే... ఎందుకు కాదన్నావో మాకూ అర్థంకాలేదు! రామం... నీ మాటను జవదాటనంటూ మాట ఇచ్చినందుకు... అది నిరూపించుకోవాలనే పట్టుదలకి

ఇలా చేసావేమోననీ అనుకోలేనూలేక, అసలు కారణమూ తెలియక... ఎంత తికమకగా అనిపించిందో...!''

ఆ మాటల్లోని నిష్టూరానికి శ్రీవల్లి చురుక్కున చూసింది.

''మన అబ్బాయి రామం మాత్రం ఇటువంటి సందేహాలేం బయటపెట్టలేదు. మీకు మాత్రం నాపై అటువంటి అనుమానం వచ్చింది! వాడు మాత్రం.... వాళ్ళ అమ్మ... తన ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయరనే నమ్మకంతో.... నన్ను.... ఎందుకూ, ఏమిటీ... అని కూడా అడగనే లేదు! చివరకు... పరాయి యింటి అమ్మాయి కూడా నా మాటను గౌరవించింది! పైగా ఎటువంటి అఘాయిత్యము తలపెట్టనని ధైర్యంగా చెప్పి... స్నేహితులుగా ఉంటామనే మాటనూ ఇచ్చింది! అంత నమ్మకం చూపించింది! నిందిస్తూ ఒక్క మాట అయినా అనలేదు!'' శ్రీవల్లి గొంతు బొంగురుపోయింది. మాట్లాడలేనట్లుగా బేలగా చూసింది.

ఆయన నిట్టూర్చాడు.

''ఇలా ఎందుకు జరిగిందనే ఆవేదనతో, ఎందుకు చేయవలసి వచ్చిందనే కదూ నిన్ను అడిగానూ.. దానికే నువ్వు బాధపడతావనుకోలేదు!''

శ్రీవల్లి చెమర్చిన కళ్ళను తుడుచుకుంది.

''మీరే దీనికి కారణం! ఆ మాట చెప్పలేకనే... మౌనంగా ఉండిపోయాను! మనసులోనే... నేనొక్కదాన్నే ఈ బాధనంతటినీ భరించాను!''

ఆయన ఉలిక్కిపడి ''నేనా...?!'' అనడిగాడు.

‘‘అవును...! మీరేకదూ, అన్నారూ... ఏదైనా మనం మాటలతోనే చెప్పటం కాదూ చేతలతో చేసి చూపించే చెప్పగలగాలీ అన్నారూ...?’’

‘‘అయితే...?’’ ఆయన మళ్ళీ ఆశ్చర్యంగా చూసాడు.

‘‘అంటే... ఏం లేదు... అదంతా జరిగిపోయిన గొడవ! ఇపుడు మనం మాట్లాడుకుంటున్నదీ, తెలుసుకోవాల్సినదీ వేరే విషయం కదా...’’ అంటూ శ్రీవల్లి దాటవేయబోయింది గానీ ఆయన ఒప్పుకోలేదు.

‘‘లచ్చిందేవీ... మాట మార్చకు. రామం నీ మాటను వేదంలా భావిస్తాడని తెలుసు. నేను మాత్రం వాడిలా కారణం కూడా అడగకుండా ఉండలేను! అన్యాయానికి ఎదురు తిరిగి ప్రశ్నించాలని, అందరికీ చెబుతున్న నేను... మన అబ్బాయి ప్రేమకే అన్యాయం జరిగితే... ఎందుకు, ఏమిటీ అని ప్రశ్నించకుండా ఉండగలనా..?’’

శ్రీవల్లి నిట్టూర్చింది. ‘‘నేను వాడి తల్లినని మర్చిపోకండి. నేను... తన ప్రేమకు అన్యాయం చేస్తానా...?’’

‘‘చేయవనే నమ్మకంతోనే వాడు నిన్ను ప్రశ్నించకుండా ఉన్నాడనుకుంటా! కానీ... తల్లిదండ్రులుగా మనం తన నమ్మకాన్ని గౌరవించి... కారణం చెప్పటం బావుంటుంది! ఇందులో పోయేదేం లేదుగా...?’’

ఆయన ప్రశ్నకి ఏం జవాబు చెప్పాలో తెలియనట్లుగా శ్రీవల్లి ఒక క్షణం మౌనంగా ఉండిపోయింది.

‘‘ఇపుడా విషయాలన్నీ ఎందుకు నాన్నా...’’ అని రామం అంటోంటే, ఆమె ‘‘నువ్వుండు... ఎవరికీ అనుమానాలు ఉండటం మంచిది కాదు. తెలిసీ నేను... నీకు... అన్యాయమే చేశాను...’’ ఆవిడ గొంతు పూడుకు పోయింది.

‘‘నేనలా అనుకోవటం లేదు కదమ్మా... నువ్వనవసరంగా బాధపడకూ...’’ రామం అనునయంగా అంటూ పక్కన కూర్చుని ఆవిడ చేయి పట్టుకున్నాడు.

‘‘నువ్వలా అనుకోకపోవటం... నువ్వు... నాకు ఇచ్చిన గౌరవం... దాన్ని నిలబెట్టుకోవటం కోసం అయినా... నేను చేసిన అనాలోచిత నిర్ణయం గురించి వివరంగా చెప్పాల్సిందే...’’ అంటూ ఆవిడ అక్కడ భద్రయ్య ఇంట్లో జరిగిన విషయాన్ని వీలైనంత క్లుప్తంగా వివరించింది.

‘‘ముందుగా... మీ నాన్న ప్రచారం చేస్తున్న కుల నిర్మూలన గురించి పరోక్షంగా మద్ధతును తెలియజేశాడాయన. ఆ తర్వాత ప్రేమ గురించీ, తన కూతురి గురించీ ప్రస్తావిస్తున్నట్లుగా నాకు తెలియకుండానే ముందరి కాళ్ళకు బంధాలు వేసేశాడు! అంతేకాదు...'సుబ్బయ్య మాటల్లోనే కాకుండా చేతల్లో కూడా చూపించాలి కదా కులమతాల పట్టింపు లేదనీ' అని అడిగేసరికి నేనేం చెప్పలేకపోయాను. ఊరందరికీ కులమతాల పట్టింపు కూడదని చెప్తున్న ఆయనకే ఎదురు దెబ్బ తగిలినట్లు బాధపడ్డాను. మనమే ఆచరణలో చూపకపోతే ఎలా ఈ కులమతాల భేదాన్ని నిర్మూలిస్తాం ? ఈ ఊళ్ళో సమసమాజ స్థాపన ఎలా చేస్తాం...అని నాకనిపించింది. అందుకే తను వేరే కులం కాబట్టి అంగీకరించరేమోనని ఆయనంటే, నాకా పట్టింపు లేదని ధైర్యంగా చెప్పేసాను. అంతేగానీ నీకు నష్టం కలిగించాలని కాదు...నీ ప్రేమకు అన్యాయం చేయాలనీ కాదు...ఆయన మాటల్లో తన సూచనకు అంగీకరించకపోతే, ఏదో విధంగా మనకు హాని కలుగుతుందేమో నన్న అభిప్రాయం కలగటంతో నేను నిస్సహాయురాలినైపోయాను...!’’ భద్రయ్య మాటలతో నాకలా అర్థమైంది మరి! అంటూ ముగించింది.

''భద్రయ్య ఆలోచన ఫలించింది కాబట్టి... ఈ పని అతను చేసి ఉండకపోవచ్చు..'' సాలోచనగా అంటున్న తండ్రి మాటలను బలపరుస్తున్నట్లుగా రామం చెప్పాడు.

''నేను...మీ పై జరిగిన దాడి గురించి తెలిసి... ఎవరై ఉంటారోనన్న విషయం తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నానని భద్రయ్య గారే నాకో సమాచారం ఇచ్చారు. పద్మనాభంగారు, పరమేశ్వరంగారూ స్నేహితులేననీ, వాళ్ళ అనుచరులు నలుగురు తన పొలం పక్కనున్న పాకలో కూర్చుని పేకాటలో ఉండి... ఆ విషయాలను చర్చించుకోవటం విన్నాననీ చెప్పారు! 'కారణం చెప్పకుండా పెళ్ళి విరమించుకున్నందుకు పరమేశ్వరం గారికి ఆగ్రహం వచ్చి ఉండొచ్చు! అందుకని పద్మనాభం గారితో కలిసి ఇలాంటి పన్నాగం ఏదో చేసి ఉండొచ్చు' అంటూ భద్రయ్యగారు తన సందేహాలను నా దగ్గిర బయటపెట్టారు.''

''అవును... ఊళ్ళోని పెద్దలకి ఇలాంటి అహంకారం ఉంటుంది. సామాన్య జనానికి అంత తెగింపూ అవసరం ఏం ఉండదు! కూలి తీసుకుని ఎటువంటి పనులు పురమాయించినా, ఆర్థిక పరిస్థితిని బట్టి పేదవాళ్ళు పనులు ఏవయినా చేయటానికి సిద్ధపడిపోతూంటారు! వాళ్ళూ... ఎదురుతిరిగి 'ఇలాంటి అక్రమాలు మేమెందుకు చెయ్యాలీ?' అని ప్రశ్నించే రోజురావాలి! అక్రమాలు చేయించిన పెద్దలు బయటపడకుండా బాగానే ఉంటారు... వీళ్ళు మాత్రం కిరాయికి ఆశపడి... ఏ పనికైనా సిద్ధమౌతారు... ఆతరువాత జైలుకైనా వెళ్ళి కూర్చుంటారు...! అందుకే ఇలాంటి నేరాలు జరుగుతుంటాయి! వాళ్ళని శిక్షించటం కంటే... ఎవరు ఇలాంటి పని చేయించారో మనం తెలుసుకోగలగాలి!'' అన్నాడాయన.

''నాన్నా... మీ శ్రమ వృథా కాలేదనిపిస్తోంది! అందరిలోనూ ఒకేసారి మార్పు రాకపోవచ్చునుగానీ క్రమేపీ వస్తుందనే ఆశ మాత్రం కలుగుతోంది! మొన్నామధ్య....

‘ఒక పెద్దింటి రైతు కూతురును ఇంకో తక్కువ కులం వాడు ప్రేమించాడనీ, రహస్యంగా ఇద్దరూ పెళ్ళి చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నారనీ తెలిసి... పిల్ల తండ్రి ఆ పేద కుర్రాడిని తక్కువ కులమనే నెపంతో చంపమని కొందరికి డబ్బు ఎర చూపిస్తే... వాళ్ళాపని చేయమని తిరస్కరించటమే కాదు ఆ విషయం అందరికీ తెలియజేయటమూ జరిగింది!’ వాళ్ళు డబ్బుకు ఆశపడక, అన్యాయాన్ని ప్రశ్నించి ఎందురు తిరగాలని అనుకోవటంవలనేగా... ఇది సాధ్యమైంది!’’ అన్నాడు రామం. తర్వాత మళ్ళీ అన్నాడు ‘‘ఇదంతా... తాతయ్యకీ తెలిసిందేమో, ‘మీ నాన్న అక్కడకు వెళ్ళినందుకు మంచి ప్రయోజనమే కనిపించిందిరా... అరుగులబడి అయ్యవారి మనవడననిపించుకున్నాడన్న మాట...!’ అనీ అన్నారు తెలుసా...?’’

రామం మాటలకు ఆయన మోహం వికసించింది! ‘‘నిజంగానా...?!’’ అంటూ కొడుకు వైపు ఆసక్తిగా చూశాడు.